క్లుప్తంగా

నిధుల మంజూరు

మునిపల్లి(అందోల్): డబుల్ బెడ్రూం ఇళ్లకు అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ నిధులు మంజూరు చేశారని మునిపల్లి సర్పంచ్ రమేశ్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పంప్‌హౌస్ నిర్మాణానికి భూమి పూజ చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు

మునిపల్లి(అందోల్): ఈ నెల 11 ఉదయం 11 గంటలకు పలు అభివృద్ధి పనులను అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ప్రారంభిస్తారని బీఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శశికుమార్ ఆదివారం తెలిపారు. మునిపల్లి చౌరస్తా నుంచి బుస్సారెడ్డిపల్లి గ్రామం వరకు సుమారు 4 కోట్ల 50 లక్షల రూపాయలతో నిర్వహిస్తున్న బీటీరోడ్డు పనులను ప్రారంభిస్తారని చెప్పారు. అంతే కాకుండా మునిపల్లి గ్రామంలో కోటీ రూపాయలతో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తారన్నారు. మన ఊరు – మనబడిలో భాగంగా అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నాలని కోరారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ



భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేస్తున్న సంస్థ బాధ్యులు

నారాయణఖేడ్: ఖేడ్‌కు చెందిన శివశక్తి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మనూరు, నాగల్‌గిద్ద మండలాల్లోని పలు గ్రామాల్లో ఉన్న వివిధ ఆలయాల్లో ఏర్పాటుకు హనుమాన్ చాలీసాతో ముద్రించిన ఫ్లెక్సీలు, భగవద్గీతలను పంపిణీ చేశారు. భక్తుల సౌకర్యార్థం వారు భక్తి భావాన్ని పెంపొందించుకునేందుకు ఆయా వాటిని పంపిణీ చేస్తున్నట్లు సంస్థ బాధ్యులు శివాజీ, శ్రీనివాస్, శ్యాం తెలిపారు. ఖేడ్ డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లోని వివిధ ఆలయాల్లో దశల వారీగా పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

గడిలో నగర సంకీర్తన



భజనలు చేస్తున్న భక్తులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని గడి ప్రాంతంలోని హనుమాన్ మందిరం వద్ద ఆదివారం నగర సంకీర్తన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతీవారం పట్టణంలో ఓ ప్రాంతంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతీవారం భక్తుల సంఖ్యల పెరుగుతోంది. హనుమాన్ మందిరం నుంచి భజనలు, కీర్తనలు పాడుకుంటూ భక్తులు పాదయాత్ర నిర్వహించారు. మహిళలు, పిల్లలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి నిర్వాహకులు అల్పాహారం అందజేశారు.

వీరభద్రుడికి ప్రత్యేక పూజలు



అభిషేకాలు చేస్తున్న భక్తులు

జిన్నారం(పటాన్‌చెరు): వీరన్నగూడెం గ్రామంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం కావటంతో భక్తులు స్వామివారి సన్నిధిలో అభిషేకాలు, అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని ఈఓ శశిధర్, నిర్వాహకులు సోమయ్య తెలిపారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



లైట్లను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కోహీర్(జహీరాబాద్): జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటీల్ మంజూరు చేసిన రూ. లక్ష నిధులతో కోహీర్ పట్టణంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. ఘడీ మసీదు వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆదివారం సాయంత్రం బీఆర్ఎస్ నాయకులు అన్నన్ జావెద్, ఫీర్‌దోస్, అజాహరోద్దీన్, మహమ్మద్ ముజీబోద్దీన్, వాజీద్ జబీ ప్రారంభించారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

జిల్లా వ్యాప్తంగా ఆదివారం చాకలి ఐలమ్మ వర్ధంతిని జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లో, పట్టణాల్లో వివిధ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆమె చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఖేడ్‌లో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప



నారాయణఖేడ్: చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



పటాన్‌చెరు టౌన్: చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న నీలం మధు



సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేటలో రజక సంఘం నాయకులు

బస్సు సర్వీసు ప్రారంభం



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి మండల కేంద్రం నుంచి సింగూర్, ఆత్మకూర్ మీదుగా సదాశివపేట వరకు బస్ సర్వీస్‌ను ఆదివారం వట్‌పల్లిలో అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల నుంచి దూర ప్రాంతాలకు బస్ సర్వీసును ప్రారంభించుకోవడం మంచి శుభపరిణామం అన్నారు. ప్రజల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ నష్టాల్లో ఉన్నప్పటికీ ప్రజలు ఇబ్బందులు పడకూడదని ఆర్టీసీ బస్సులను నడుపుతుందన్నారు. ప్రతీరోజు మూడు ట్రిప్పులు వట్‌పల్లి నుంచి సదాశివపేట వరకు నడువనుందన్నారు. ప్రజలు ఈ బస్సు సర్వీస్‌ను వినియోగించుకొని తమ గమ్యాలను సురక్షితంగా చేరుకోవాలన్నారు. బస్ సర్వీస్‌ను ఏర్పాటు చేసిన ఖేడ్ బస్ డిపో మేనేజర్ మల్లేశం, రూట్ ఇన్‌చార్జ్ పాండులకు అభినందనలు తెలియజేశారు. అనంతరం టికెట్ తీసుకొని ఎమ్మెల్యే బస్సులో ప్రయాణించారు. కార్యక్రమంలో వరం చైర్మన్ వీరారెడ్డి, రేగోడ్ మాజీ ఎంపీపీ పత్రి విఠల్, సర్పంచ్ సురేఖ బుద్ధిరెడ్డి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అశోక్‌గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శివాజీరావు, తాజా మాజీ ఏఎంసీ డైరెక్టర్ మధు, వెంకట గాజ, భక్తులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ఉచిత కుట్టు మిషన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాటా సుధా శ్రీనివాస్ గౌడ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ నగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదిగి పది మందికి ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పావని తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన యువకులు



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పలువురు యువకులు ఆదివారం ఎమ్మెల్యే మాణిక్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు నవాబ్ జానీ ఆధ్వర్యంలో 30 యువత పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని చూసి యువత పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు మైహియోద్దీన్, నాయకులు ముర్తుజా, నయూమ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ దీవెనలు అందరిపై ఉండాలి



దుర్గమ్మ పూజలు చేస్తున్న నీలం మధు

ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు

పటాన్ చెరు: దుర్గమ్మ తల్లి దీవెనలు అందరిపై ఉండాలని ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. అమీన్‌పూర్ మండలం పటేల్ గూడ గ్రామంలో ఆదివారం శ్రావణ మాస దుర్గమ్మ బోనాల కార్యక్రమానికి నీలం మధు ముదిరాజ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ ఎంపీపీ ఈర్ల దేవానంద్, సర్పంచ్ నితిశశ్రీకాంత్, పటేల్ సుధాకర్, రాము, రాజుగౌడ్, తలారి రాజు, అశోక్, సుధాకర్, సంతోష్, వినోద్, వెంకటయ్య, చందు, వెంకటేశ్, కిషోర్, గణేశ్, జాతర నిర్వాహకులు, యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు స్వర్ణామృత ప్రాస చుక్కల పంపిణీ



చుక్కల మందు వేస్తున్న డాక్టర్ శేషు పద్మనాభం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఆదివారం పిల్లలకు స్వర్ణామృత ప్రాస చుక్కల మందు పంపిణీ చేశారు. పట్టణంలోని బ్లాక్ రోడ్డులోని శ్రీదత్తసాయి పిల్లల ఆస్పత్రిలో డాక్టర్ శేషు పద్మనాభం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వికాస తరంగిణి జహీరాబాద్ అధ్యక్షుడు అల్లాడి వీరేశం మాట్లాడుతూ.. ఆరు రోజుల నుంచి 16 ఏళ్ల వయసు కల్గిన పిల్లలకు చుక్కల మందు వేస్తామన్నారు. వీటిని వేయడం వల్ల చురుకుదనం, జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి నాయకులు ఉమామహేశ్వర్‌రావు, విజయలక్ష్మి, సాయిరెడ్డి విఠల్‌రెడ్డి, బెజుగం సంధ్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు సింహంద్వారం ప్రతిష్ఠాపన

నారాయణఖేడ్: పట్టణంలోని రామాలయ పునఃనిర్మాణంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో సోమవారం ఉ.11:30 గంటలకు ఆలయ సింహద్వారం ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసి సీతారామచంద్రస్వామి అనుగ్రహాన్ని పొందాలని కోరారు.

రేపే పుల్‌కల్ ఎంపీపీ సమావేశం

పుల్‌కల్(అందోల్): మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 12న ఏర్పాటు చేశామని పుల్‌కల్ ఎంపీడీఓ జయలక్ష్మి తెలిపారు. ఎంపీపీ పట్లోళ్ల చైతన్య రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, అధికారులు విధిగా హాజరై విజయవంతం చేయాలని ఆమె తెలిపారు.

నలుగురికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం నలుగురికి కోవిడ్ ర్యాపిడ్ యాంటీజెన్ టెస్టులు నిర్వహించగా, అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



గోపాల్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

జహీరాబాద్ టౌన్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు గోపాల్‌ను ఆదివారం ముదిరాజ్ సంఘం నాయకులు సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బుర్దిపాడ్ పాఠశాలలో పని చేస్తున్న గోపాల్‌కు ఉత్తమ టీచర్‌గా అవార్డు వచ్చిన సందర్భంగా పట్టణంలో గోపాల్‌ను ముదికాజ్ సంఘం నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు శ్రీశైలం, బరూర్ దత్తాత్రి, శంకర్, నర్సింలు, కృష్ణ, సిద్ధు, సత్యనారాయణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సింగూరుకు కొనసాగుతున్న వరద

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. ఆదివారం 3962 క్యూసెక్కుల నీరు చేరింది. జలవిద్యుత్ కేంద్రంలో 1,460 క్యూసెక్కులు నీటిని వినియోగించి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. జంట నగరాల తాగునీటికి 80 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు.

'నీలం మధుకు టికెట్ ఇవ్వాలి'

పటాన్‌చెరు టౌన్: ఇండిపెండెంట్‌గా పోటీ చేసినా గెలిచే సత్తా ఉన్న అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అని హెచ్‌సీయూ ముదిరాజ్ చైతన్య వేదిక చైర్మన్ శివకుమార్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ముదిరాజ్ భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు టప్పుకుమార్, సబ్బండ వర్గాల నాయకులతో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్త చైతన్యయాత్రలో భాగంగా 17 నియోజకవర్గాల్లో నిర్వహించామన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో 65 లక్షలకు పైగా ఉన్న ఈ వర్గానికి 15 నుంచి 20 ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాల్సి ఉండగా, కనీసం ఒక్కటి కూడా ఇవ్వకపోవడం సరికాదన్నారు. టప్పుకుమార్ మాట్లాడుతూ, ముదిరాజులంతా ఏకమై రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నచూపు చేసే పార్టీలకు సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. అనంతరం ఉద్యమకారుడు అన్వర్ పటేల్, నరేష్ ముదిరాజ్ ప్రసంగించారు. కార్యక్రమంలో చైతన్య యాత్ర సభ్యులు, ముదిరాజ్ సంఘం నాయకులు, సబ్బండ వర్గాల నాయకులు పాల్గొన్నారు.

బాలుడికి అటవీ అధికారుల పరామర్శ

జిన్నారం(పటాన్‌చెరు): ఇటీవల కొండముచ్చు దాడిలో గాయపడిన గుమ్మడిదలలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థి సుజిత్‌కుమార్‌ను ఫారెస్టు అధికారులు మంజీత్‌సింగ్, నిజాముద్దీన్, నర్సింలు, ఎన్ మహ్మద్‌లు ఆదివారం పరామర్శించారు. అతడికి పలు సూచనలు చేశారు. కోతులు, కొండముచ్చులు గ్రామాల్లోకి రాకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట గ్రామ పరిధిలోని మైత్రి మేడోస్, మైత్రి విల్లా కాలనీ వాసులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యేకు ఆత్మీయ స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కాలనీల్లో తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీల్లో సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీలు, రక్షిత మంచినీరు అందించేందుకు ప్రణాళికతో నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అనంతరం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కృష్ణదేవరాయ కాలనీలో నూతనంగా నిర్మించిన కాలనీ కమ్యూనిటీ హాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహగౌడ్, వైస్ ఎంపీపీ సునీత సత్యనారాయణ, సర్పంచ్ కృష్ణ, ఉప సర్పంచ్ ఫహీం, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేశాం



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేశామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీ సోమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం సమీపంలో ఎమ్మెల్యే సొంత నిధులతో నిర్మిస్తున్న యాదవ కమ్యూనిటీ భవనానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధిలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రామచంద్రాపురం, భారతినగర్ పటాన్‌చెరు డివిజన్‌లోని పలు సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపమని తెలిపారు. ప్రజలకు ఏ సమస్య ఉన్న నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప నగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అలూరి గోవింద్, నాయకులు ఆదర్శ్ రెడ్డి, పరమేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ధర్నాకు మద్దతు

ఎంపీపీ గిరిధర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: రైతుల ధర్నా 12న నిర్వహిస్తున్నట్లు ఆ ధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు, ఎంపీపీ గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గత సంవత్సరం రైతులు సరఫరా చేసిన చెరకు పంటకు సంబంధించి ఇంత వరకు పూర్తి బిల్లులు చెల్లించలేదన్నారు. ట్రైడెంట్ కర్మాగారం యాజమాన్యం ఇంకా రైతులకు రూ. 10 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. బకాయి బిల్లులు చెల్లించాలని, క్రషింగ్ కోసం మరమ్మతులు చేపట్టాలని, కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. రైతులు చేపట్టనున్న ధర్నాకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షులు కండెం నర్సింలు, మండల అధ్యక్షుడు నర్సింహరెడ్డి, నాయకులు గుండారెడ్డి, శక్లవర్ధన్ రెడ్డి, భీమయ్య, చందర్, మల్లారెడ్డి, మైనొద్దీన్, యువజన కాంగ్రెస్ నాయకులు నరేశ్‌కుమార్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చార్జ్‌షీట్ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సురేశ్ షెట్కార్

నారాయణఖేడ్: కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముద్రించిన చార్జ్‌షీట్ కరపత్రాలను ఆదివారం టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు సురేశ్ షెట్కార్ ఖేడ్‌లోని తన నివాసగృహం ఆవరణలో ఆవిష్కరించారు. అనంతరం నియోజకవర్గంలోని మండలాల పార్టీ బాధ్యులు, ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చార్జ్‌షీట్ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేయాలని అన్నారు. ప్రతీ గ్రామంలో బూత్ ఏజెంట్‌లను ఎన్నుకొని అర్హులైన వారిని ఓటర్లుగా చేర్పించడం, మర్పులు, చేర్పులు, మృతుల పేర్లు తొలగించడానికి అధికారుల ద్వారా కృషిచేయాలని అన్నారు. మండలాల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు తాహెర్ అలీ, మనీష్ పాటిల్, మధు, సుభాష్ పాటిల్, శంకర్‌గౌడ్, సంజీవ్ పటేల్, చందర్ నాయక్, జైపాల్‌గౌడ్, బక్షిరాం, కొండల్‌రెడ్డి, విఠల్ రెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత లర్నింగ్ డ్రైవింగ్ లైసెన్సుల అందజేత



డ్రైవింగ్ లైసెన్సులు అందిస్తున్న సాయినాథ్

సదాశివపేట(సంగారెడ్డి): మండల పరిధిలోని చందాపూర్ గ్రామ యువకులకు ఆదివారం పట్టణంలోని చింతా ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో ఉచిత లర్నింగ్ డ్రైవింగ్ లైసెన్సులు అందజేశారు. వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో యువతీ, యువకులకు ఉచిత లర్నింగ్ డ్రైవింగ్ లైసెన్సులు అందజేస్తున్నామని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు సాయినాథ్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అహ్మద్, మాజీ సర్పంచ్ చంద్రన్న, మండల పార్టీ అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, నాయకులు నవాబు రాచిరెడ్డి, కాఖా, నర్సింలు, వసీం, అక్రమ్, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టికెట్ కోసం బీజేపీ నాయకుల దరఖాస్తు



దరఖాస్తు చేసుకుంటున్న సుధీర్‌కుమార్



దరఖాస్తు చేసుకుంటున్న రాజుగౌడ్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ టికెట్ కోసం బీజేపీ నాయకులు ఆదివారం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో జిల్లా అధికార ప్రతినిధి సుధీర్ కుమార్, ఎస్సీ సెల్ నాయకుడు అశోక్ ఉన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఇద్దరు విడివిడిగా దరఖాస్తు పెట్టుకున్నారు. జహీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు తమకు టికెట్ ఇవ్వాలని ఇరువురు నాయకులు కోరారు. పార్టీ పిలుపునిచ్చిన ప్రతీ కార్యక్రమాన్ని విజయవంతం చేశానని సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేశానని జహీరాబాద్ టికెట్ తనకే ఇవ్వాలని ఆయన కోరారు.

సంగారెడ్డి టికెట్ ఇవ్వాలని..

సంగారెడ్డి అర్బన్: బీజేపీ సంగారెడ్డి టికెట్ తనకు ఇవ్వాలని ప్రభుత్వ ఆస్పత్రి మాజీ సూపరిండెంటెంట్ రాజుగౌడ్ ఆదివారం బీజేపీ అధిష్ఠానానికి దరఖాస్తు చేసుకున్నారు. పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించి టికెట్ కేటాయించాలని కోరినట్లు తెలిపారు.